

# అనగనగా...కథలు

## - డా.శైలజ చందు



## వెన్నెల్లో శ్యామల

**"అమ్మా" అంటూ** బబ్లూ లోపలికొచ్చి, స్కూలు బాగ్ పక్కన పడేశాడు. నైన్త్ చదువుతున్నాడు.  హాల్లో కిటికీ పక్కన సోఫాలో కూర్చుని, పేపర్లు సర్దుకుంటోంది.

తన పిలుపుకి తలెత్తలేదంటే సీరియస్ పనిలో వుందని. లోపలికెళ్లి స్నానం చేసి తల్లి దగ్గరకొచ్చి కూర్చున్నాడు. రెక్సోనా పరిమళాలు అలుముకున్నాయి.

శ్యామల ప్రెజెంటేషన్ స్లైడ్స్ సరిచూసుకుంటూ, పేపర్లు సర్దుకుంటోంది.

“అమ్మా,  నెక్స్ట్ ఇయర్ వేరే స్కూల్లో చేరనా?” అడిగాడు.

తలెత్తి చూసింది. వాడి బుగ్గలు నునుపుగా మెరుస్తున్నాయి.

బబ్లూ, బొద్దుగా అవుతున్నాడు. పిల్లల బుల్లీయింగ్ తో ఇబ్బంది పడుతున్నాడు. అందుకే కొత్త స్కూల్లో చేరితే అంతా బాగుంటుందని వాడి ఆశ.

"సరే" అంది.

భర్త పనిచేసే బాంక్ కు దగ్గరగా వుంది ఇల్లు.  శ్యామల పనిచేసే కాలేజీ, ఇంటి నుండి పది కిలోమీటర్లు. ఎటూ తను కారు తీస్తుంది కనక, భర్త ని బాంక్ దగ్గర దించి, బబ్లూని స్కూలు దగ్గర దించి వెళ్లాలి. ఇంట్లో వంట పని, లెక్చర్స్, టీచింగ్ మెటీరియల్, ఎగ్జామ్ కు మెటీరియల్ సిద్ధం చేసుకోవడం, వీటితోనే సరిపోతోంది.

కొడుకువంక చూసి ‘వాడి బరువు మీద శ్రద్ధ పెట్టాలి. కానీ ఎలా? ఉదయం లేచిన దగ్గర్నుండి పరుగులు, పని.’ అనుకుంది.

భర్త దగ్గర ఏ ఇబ్బంది గురించి ప్రస్తావించినా రిజైన్ చెయ్యమని సలహా ఇస్తాడు.

తల్లి బాగ్ తెరిచి"అమ్మా, థర్టీ రూపీస్ తీసుకున్నా" చెప్తూ బయటికి వెళ్ళాడు.

ఆకలిగా వుంది కానీ, లేచి వంట ప్రయత్నాలు చేయాలంటే ఇష్టం లేనట్టు కూర్చుంది.

పది నిముషాలకు "అమ్మా, నూడిల్స్" రెండు పాకెట్లు తెచ్చి టీపాయ్ మీద పెట్టాడు, బబ్లూ.

ముట్టుకుని చూసింది. కాలుతున్నంత వేడిగా వున్నాయి. కిచెన్లోకి వెళ్లి రెండు ప్లేట్లు, ఫోర్కులు తెచ్చాడు. పింగాణీ ప్లేట్లో సర్దాడు, మసాలా నూడుల్స్. వేడి నూడుల్స్ వూదుకుంటూ తింటున్నారిద్దరూ.

"మనం చేస్తే ఇలా రావేంట్రా?" అడిగింది.

“రసూల్ బలే చేస్తాడు.” మెచ్చుకోలుగా చెప్పాడు.

కడుపు నిండింది.

మైక్రో బయాలజీ లో అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తోంది ఆమె. ఆస్ట్రేలియన్ జర్నల్ కు ఆమె పంపిన పరిశోధనా పత్రాన్ని లో ఆమోదించారు. వచ్చేనెల పబ్లిష్ కాబోతోంది. అప్పటికే ఆమె ఆర్టికల్స్ వేర్వేరు మెడికల్ జర్నల్స్ లో ప్రచురించబడ్డాయి.

రేపటి కాన్ఫరెన్స్ లో ప్రెజెంట్ చేయబోయే రీసెర్చ్ ఫలితాలను ఓ సారి చూసుకుంటోంది. అవసరమైన పేపర్లన్నిటినీ ఓ ఫోల్డర్ లో పెట్టింది.

లోపలికి వెళ్ళి రేపటికే చీర కట్టుకోవాలో చూసుకుంది. అవి పక్కన పెట్టింది.

అసిస్టెంట్స్ కు ఫోన్ చేసి ఏ టైముకు రావాలో చెప్పి, కాఫీ తెచ్చుకుని సోఫాలో కూర్చుంది. అలిసిన శరీరానికి హాయిగా వుంది.

హాల్లో కార్పెట్ మీద బుక్ పెట్టుకుని హోం వర్క్ చేస్తున్నాడు, బబ్లూ.

భర్త గుర్తొచ్చాడు. అతనొచ్చే సరికి వంట చెయ్యాలి. వేడిగా వుండాలి. లేచి వంట ప్రయత్నాలు చేయాలంటే ఓపిక లేనట్టు కూర్చుంది. వంట మనిషిని పెట్టుకుందామంటే ఒప్పుకోడు రాజారావు. పరాయి వాళ్ళు వంటింట్లో తిరుగుతుంటే నచ్చదతనికి.

‘అతను లేటుగా వస్తే బాగుండు. ఏదైనా వూరెళ్తే కూడా బాగానే వుంటుంది. కనీసం బయట భోంచేసి వస్తే’

ఆశగా అనుకుంటుంటే అతనే ఫోన్ చేశాడు.

"ఏవోయ్, ఏం చేస్తున్నావు?" అంత మంచిగా పలకరిస్తే ఏదో వుంటుందని సోఫాలో నిటారుగా కూర్చుంది.

"రెడీ అయ్యావా?"

"దేనికీ?"

"మర్చిపోయావా? చిన్ని బర్త్ డే ఇవాళ."

“చిన్ని? ఎవరు? "

"అదేనేయ్, ప్రశూ. కల్యాణి గారి పాప. మేడమ్ మరీ మరీ చెప్పారు రమ్మనమని."

కల్యాణి, అతని కొలీగ్ మోహన్రావు భార్య. వాళ్లమ్మాయి ప్రశస్త. ఆ పాపని చిన్నీ అని పిలుస్తారు, వాళ్లింట్లో.

ఫ్రెండ్ కూతురైనా, వాళ్లమ్మ కూతురుగానే చెప్తాడు.

"నాతో ఏమీ చెప్పలేదే?"

"సరేలేవోయ్. నాకు చెప్తే నీకు చెప్పినట్టు కాదా? సరే కానీ, కొంచం బిరియానీ చెయ్యి. ప్రశూకిద్దాం. ఈ పూట తన బర్త్ డే కదా."

"బిరియానీయా? అయినా వాళ్ళింట్లో పార్టీకి మనమెందుకు తీసుకెళ్లడం?"

"పాట్ లక్ లాగా. ఏదో ఒకటి తీసుకెళ్లాలిగా మనం."

"ఇప్పటికిప్పుడు బిరియానీ, అంటే ఎలా?"

"ఎంత సేపట్లో చేస్తావోయ్. కుక్కర్లో బిరియానీ బాగా చేస్తావుగా. అది చెయ్యి.

కొత్త బ్లాక్ మెటల్ కుక్కర్ కొన్నామే. దాంట్లో వండు. కుక్కర్ తోనే పట్టుకెళ్ళి ఇద్దాం. సర్ప్రైజింగ్ గిఫ్ట్ గా వుంటుంది."

శ్యామల మౌనంగా వుంది.

"ఏంటాలోచిస్తున్నావు. బబ్లూని పంపించి చికెన్ తెప్పించు. వాడికి కాసిని పనులు నేర్పు. మరీ దద్దమ్మలా తయారు చేస్తున్నావు వాణ్ణి."

వంటింట్లో కెళ్లే ఓపికే లేదు. ఆ మాట చెప్తే ఎలా రియాక్ట్ అవుతాడోనని ఆలోచిస్తోంది. తప్పకుండా గొడవ అవుతుంది.

అలుగుతాడు. ఆ కోపం భరించడం కన్నా, అదేదో చేసేస్తేనే నయం అనుకుంది. గొడవ తప్పదు. రేపు కాన్ఫరెన్స్ చాలా ముఖ్యం. అందునా అమ్మా నాన్నా మధ్య గొడవలంటే భయపడుతున్నాడు, బబ్లూ.

మెటల్ కుక్కర్ రెండు చేతులతో మోస్తూ లోపలికి వెళ్లాడు బబ్లూ. వెనక శ్యామల పక్కనే నడుస్తూ ఫుడ్ అరేంజ్ చేసిన టేబుల్ మీద పెట్టించింది. పార్టీలో, చాలా మంది తమ స్కూలు పిల్లలు కనిపిస్తున్నారు.

అమ్మాయిలు కొంతమంది బబ్లూని గుర్తు పట్టారని వారి చూపే చెప్తోంది.

ప్రశస్త వాళ్లమ్మ కల్యాణి అందంగా తయారయింది. లేతాకు పచ్చ శాటిన్ చీరలో మెరుస్తోంది. జుట్టు అందంగా ముడిచింది. భర్త మగ స్నేహితులతో మాట్లాడుతోంది కల్యాణి.

ఆడవారికి ఐక్యూ వుండదని, మగ వారితోనే మాట్లాడుతుంది ఆమె. పార్టీలో ఆడవారిని సంబాళించడానికి కొందరిని నియమించింది.

రాజారావు ఆ మగవారి గుంపులో కలిశాడు. పక్కనే ప్రశస్త నిలబడి వుంది. బర్త్ డే అమ్మాయి, ప్రశస్త ఎంసెట్ లో రాంక్ సాధించింది. బర్త్ డే నాడు ఆ సందర్భం కూడా కలిసి వచ్చింది.

ఆమె బాగా ఎదిగింది. చామనచాయ బుగ్గలు మెరుస్తున్నాయి. స్లీవ్ లెస్ చుడీదార్ లో గుండ్రని చేతుల నునుపుదనం తెలుస్తోంది.

ఎటు వేపు వెళ్లినా మగవాళ్ళ చూపులు ఆమె వెంటే తిరుగుతున్నాయి.

'డ్రెస్ తర్వాతి సైజ్ వేసుకుని ఉంటే చూసే కళ్లకి శ్రమ లేకపోవును.' అనుకున్నారు ఆడవాళ్లు.

"మా బడుద్ధాయికి మూడు ట్యూషన్లు, ఉదయం ఒకటి, సాయంత్రం రెండు. వాళ్లమ్మ సెలవు రోజుల్లో కూర్చుని నూరిపోస్తూనే ఉంటుంది. అయినా సరే, అరవైలకే అలుపు, సెవెంటీకే సొలుపు, పది దాటాక పరుపు." బబ్లూ సంగతి చెప్తున్నాడు. ప్రాస కూర్చిన జోక్ కాబట్టి హిట్ అవుతుందన్న నమ్మకంతో తనే ముందు నవ్వాడు. అందరూ అతని వంక చూసి నవ్వారు.

ఆ పిల్ల భుజాల చుట్టూ చేయి వేసి మెత్తగా అభినందిస్తున్నాడు రాజారావు. నలభై రెండేళ్ల గరుకుదనం భుజాల నునుపు మీంచి జారలేకపోతోంది. అక్కడనే నిలబడి మెత్తదనాన్ని పరిశీలిస్తోంది.

పిల్లకు చిరునవ్వొస్తోంది. చిన్ని వయసు, అందరూ మెచ్చుకోవడం, నవ్వేందుకు పెద్ద కారణం లేకపోయినా నవ్వేస్తోంది. ఆ మెప్పుదలకు పెదవులు విచ్చుకుని, బుగ్గలు సొట్టలు పడ్డాయి.

"ప్రశూ, మా వాడికి కొంచం చదువు మీద టిప్స్ చెప్పాలోయ్."

"అలాగే అంకుల్."

"అలాగే అంటే కాదు. నువు కాలేజీలో చేరేంత వరకూ కనీసం ఒక హాఫ్ యాన్ అవర్ వాడికి గైడన్స్ ఇవాలి."

"మీరు పర్మిషనిస్తే.." వినయంగా చేతులు నలుపుకుంటూ కల్యాణిని కోరాడు.

"ప్రశూకి వాళ్లమ్మ తెలివి, గ్రేస్ రెండూ వచ్చాయి."

పిల్లవంకతో అడ్డు పెట్టుకుని తల్లిని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు.

ఇటువంటి స్త్రీలుండబట్టే, గ్రహాలు కక్ష్యలో తిరుగుతున్నాయని, లేపోతే భూమి ఏనాడో ఓ పక్కకు వొరిగిపోయేదని నమ్మబలుకుతున్నారు.

కల్యాణి అందంగా సిగ్గుపడింది.

ఆమె సిగ్గు చూసి, "ఆహా! కట్టుకుంటే ఇటువంటి విరగబోణినే కట్టుకోవాలి సుమా. ఈమె వంటి భార్య నాకేగనక ఉంటే ప్రపంచాన్ని జయిస్తాను." అనుకుని, రాజారావు భార్య వంక చూశాడు.

"ఎలా చేసుకున్నానురా దీన్ని" అనుకుని, తనపై తనకు వువ్వెత్తున కోపం వచ్చిందతనికి.

❧❧❧

పార్టీలో కేక్ కట్ చేసింది ప్రశస్త. రాజారావు ఫొటోలు తీస్తున్నాడు.

"రోహిత్, పాట పాడు" ఆడపిల్లలందరూ అరిచారు.

శ్యామల ఆశ్చర్య పడింది.

"పాటేమిటి? నీకు పాడడం వచ్చా నాన్నా?" శ్యామల అడిగింది బబ్లూని.

"వచ్చేంటి ఆంటీ, స్కూల్లో ప్రేయర్ తనే పాడతాడు. మ్యూజిక్ బాండ్ లీడర్ తనే." పిల్లలు చెప్పారు.

"పాడు రోహిత్, పాడు." అందరూ బబ్లూ చుట్టూ చేరారు. ప్రశస్త తన గిటార్ తెచ్చి ఇచ్చింది.

హాపీ బర్త్ డే పాట పాడాడు.

పాడేటపుడు శ్యామల అతన్ని గమనించింది. ఎప్పటిలా సిగ్గుపడే బబ్లూ కాదు. సంతోషాన్ని అనుభవిస్తున్నాడు.

"బాబూ, ఏదైనా తెలుగు పాట పాడు." అన్నారు ప్రశస్త తాతగారు.

"రోహిత్, మొన్న కాంపిటీషన్ లో పాడావే , జగడ జగడ అది పాడు." అడుగుతున్నారు పిల్లలు.

ఒక సారి తల్లి వంక చూశాడు.

**మరల మరల జననం**

**రానీరా మరల మరల మరణం**

**మింగేస్తాం భువల భగల గరళం**

**మా పిలుపే ఢమరుకం**

**మా ఊపిరి నిప్పుల ఉప్పెన**

**మా ఊహలు కత్తుల వంతెన**

శ్యామల అందరికన్నా ఆశ్చర్యపోయింది. కొత్త మనిషిని చూసినట్టు చూస్తోంది.

బబ్లూ గొంతులో సుతిమెత్తని లక్షణం! ఆమె హృదయమంతా రెక్సోనా పరిమళం నిండింది.

❧❧❧

వచ్చేదారిలో శ్యామల డ్రైవింగ్ చేస్తుంటే పక్కన కూర్చున్నాడు, రాజారావు. పార్టీ అయిపోయినా మాటల Euphoria తగ్గలేదు. ప్రశూ వాళ్ల కుటుంబానికీ, తమకూ స్నేహం పెరగాలన్న ఆశ అతని మాటల్లో తెలుస్తోంది.

రెండు నిముషాలకోసారి, వెనక సీట్లో కూర్చున్న కొడుక్కి ఏయే విషయాల్లో అతను తన వైఖరి మార్చుకోవాలో, విజయాన్ని సొంతం చేసుకోవడానికి ఎంత శ్రమించాలో, తల్లిదండ్రుల గౌరవాన్ని నిలబెట్టడానికెంత కృషి చేయాల్సి ఉందో చెప్తున్నాడు. చెప్తూ చెప్తూ అలిసిపోతున్నాడు.

బబ్లూ కిటికీ లోంచి లైట్లనూ, షాపుల్నీ చూస్తున్నాడు.

"నువ్వు కూడా మబ్బులా వుండకు. ఆమెను చూసి నేర్చుకో. సొసైటీలో ఎలా మెలగాలో, ఎలా ప్రవర్తించాలో నేర్చుకో." భార్యకు సూచిస్తూ,

"మంచిని ఎక్కడున్నా స్వీకరించగలగాలి." అన్నాడు.

ఓ వారం తర్వాత సాయంత్రం, శ్యామల బబ్లూ హోమ్ వర్క్ లో సహాయం చేస్తోంది.

"వెరీ గుడ్ న్యూస్" అంటూ వచ్చాడు రాజారావు.

ఇంట్లో అతనలా సంతోషంగా మాట్లాడడం అదే మొదటి సారి.

"ప్రషాని మన వాడికి కోచింగ్ ఇవ్వమని వాళ్ల మమ్మీని రిక్వెస్ట్ చేస్తున్నానా? ఇన్నాళ్లకి ఒప్పుకుంది. వి ఆర్ వెరీ లక్కీ. రేపట్నుండి వస్తుంది ప్రశస్త."

ఆ ఆలోచన ఏమంత బాగాలేదు శ్యామలకు.

శ్యామల ఆలోచనల్ని చదివినట్టు, "వాడు పనికి రాకుండాపోతున్నాడోయ్. కనీసం మంచి స్టూడెంట్స్ తో కలుస్తుంటే బాగుపడతాడు." శాంతంగా చెప్పాడు.

'ఎదుగుతున్న పిల్ల, బబ్లూ కి ఏం ట్యూషన్ చెప్తుంది.

టీనేజ్ పిల్లల్ని వంటరిగా ఇంట్లో వదిలెయ్యడం ఎంత వరకూ మంచిది. ' ఆలోచిస్తూ కూర్చుంది.

ఆ మాటే భర్తతో అంది.

" అంతగా అయితే నేను త్వరగా వచ్చేస్తాను. నేనుంటానుగా. ఏం జరుగుతుంది ఇంతలో?" అన్నాడు.

ఓనాడు శ్యామల ఇంటికొచ్చేసరికి లోపల అలికిడి లేదు.

తలుపు వేసి వుంది. లోపల్నుండి మాటలు వినిపిస్తున్నాయి. తలుపు కొడితే తీశాడు రాజారావు.

హాల్లో ముగ్గురున్నారు. సోఫాలో ప్రశస్త, పక్కనే బెల్ట్ తీసి, చేతిలో పట్టుకుని భర్త.

ఓ పక్కన తెల్ల టవల్ కట్టుకున్న బబ్లూ. బబ్లూ వంటి మీద నీళ్ల బిందువులు.

ముగ్గురి ముఖాల్లోనూ అర్థంకాని భావాలు.

శ్యామలను చూడగానే ప్రశస్త చున్నీ సర్దుకుని బయటికి పరుగు తీసింది.

"చదువుకోమని చెప్తే వీడేం చేస్తున్నాడో తెలుసా. అంటూ" అంటూ బెల్ట్ తో కొట్టబోయాడు.

శ్యామల అడ్డు నిలబడింది. ఖాదీ చీర బబ్లూ వంటి తడిని అద్దుతోంది. స్వచ్ఛమైన రెక్సోనా పరిమళం ఆమెను తాకింది.

"ఆ పిల్లనేం చెయ్యబోయావురా, అడ్డులే. వీణ్ణివాళ చంపేస్తాను." అంటూ శ్యామలను లాగేశాడు.

మళ్ళీ అడ్డుగా నిలబడి సూటిగా చూసింది. మొదటి సారి అతని కళ్ళలోకి!

చేతిలో బెల్ట్ నేలకేసి కొట్టాడు రాజారావు.

"దేనికీ పనికిరాకుండా పోతాడు చూస్తుండు.  ఛీ." అంటూ గదిలోంచి బయటికెళ్ళిపోయాడు.

ప్రశస్త ట్యూషన్ కి రావడం మానేసింది.

వాళ్ల అమ్మానాన్నా గొడవకొస్తారని, క్షమాపణ ఎలా వేడుకోవాలోనని భయపడింది కానీ,  కానీ వాళ్ళు రాలేదు. ఇంట్లో చెప్పినట్టు లేదు.

శ్యామలకు ఒక మెసేజ్ పంపింది, ప్రశస్త.

"ఆంటీ, రోహిత్ ని ఏమనకండి. హి ఈజ్ ఇన్నోసెంట్." అని. ,

వేసవి సెలవలిచ్చారు.

ముఖ్యమైన సర్టిఫికేట్స్, బట్టలు ఒక సూట్ కేసులో పెట్టి తాళం వేసి లిఫ్ట్ దగ్గర వాచ్ మాన్ గదిలో పెట్టింది.

డ్రైవర్ కారు తీసుకుని వస్తే, అందులో పెట్టించమని చెప్పింది.

పైకొచ్చి చూస్తే బబ్లూ పెయింటింగ్ గీసుకుంటున్నాడు.

శ్యామల వచ్చి దగ్గరగా వున్న సోఫాలో కూర్చుంది.

"అమ్మా, నూడిల్స్ తీసుకురానా?"

"ఎగ్స్ తెస్తావా?"

"ఎగ్ నూడిల్సా? "

"కాదు, ఎగ్స్ తీసుకురా."

పెద్దగా వాదించడు. పది రూపాయలు జేబులో పెట్టుకుని వెళ్తుంటే,

"ఉండు, నేనూ వస్తా." అంది బాగ్ తీసుకుని.

లిఫ్ట్ గ్రౌండ్ ఫ్లోర్ లో ఆగింది.

బయటికి అడుగు పెట్టగానే భర్త ఎదురుగా వున్నాడు.

“ఎక్కడికీ ఇద్దరూ?"

"ఎగ్స్ కోసం" బబ్లూ సమాధానం చెప్పాడు.

"అమ్మ లేకుండా ఎగ్స్ కూడా తేలేవు. దేనికి పనికొస్తావు?"

పెదవి కొరుక్కుంటూ నిలబడ్డాడు బబ్లూ.

“ఇలా పెంచుతున్నావు. దేనికీ పనికి రాకుండా.” భార్యతో అన్నాడు.

ఇంటి తాళం అతని చేతికిచ్చింది. అతను పైకెళ్ళిపోయాడు. కార్లో వెళ్తుంటే బబ్లూ అడిగాడు.

“అమ్మా, ఎక్కడికి వెళుతున్నాం?”

“నువ్వు కొత్త స్కూల్లో చేరాలనుకున్నావుగా. అక్కడికి.”

“ఏ వూరు.”

ఆస్ట్రేలియాలో ఆమెకు  రీసెర్చ్ అసిస్టెంట్ వుద్యోగం వచ్చింది. ఉద్యోగమిచ్చిన కాలేజి, ఫ్లైట్ టికెట్స్ పంపించింది.

అదే చిన్న వాక్యాలలో చెప్పింది.

“మరి డాడీకి చెప్పలేదుగా మనం.”

“చెబ్దాం” అతని చేయి మీద తట్టింది.

ఎయిర్పోర్ట్ లో బోర్డింగ్ పాస్ తీసుకున్నపుడు ఆమెకు ఫోనొచ్చింది.

"ఎగ్స్ తెస్తానని ఎక్కడికి చచ్చారు? వంటెప్పుడు చేస్తావు?”

"రావడానికి లేటవుతుంది.  ఏదైనా తెప్పించుకోండి." జవాబిచ్చింది.

"ఏం తమాషాగా వుందా?"

గేటు తెరిచి అందర్నీ రమ్మంటున్నారు. బబ్లూ లేచి వెళ్లబోయాడు.

“వుండు మనం ఆఖరికి. మనది బిజినెస్ క్లాస్.”

“బిజినెస్ క్లాసేవిటే? అసలెక్కడ చచ్చారు. సినిమాకెళ్లారా? కాళ్లిరగ్గొడతాను, దరిద్రమ్ముండా. త్వరగా రా” అరిచి ఫోన్ పెట్టేశాడు.

ప్రతిరోజూ ఉదయాన్నే అతను తప్పని సరిగాచూసే ఒక అరలో ఒక వుత్తరం పెట్టి వచ్చింది.

సంవత్సరాల తర్వాత, ఆమె ప్రెజంట్ చేసిన పరిశోధనకు, బెస్ట్ రీసెర్చ్ పేపర్ అవార్డ్ వచ్చింది. అదొకటే కాదు. ప్రొఫెషన్లో ఎన్నో విజయాలు.  స్ఫూర్తినిచ్చే టీచర్ గా ఎంతో మంది స్టూడెంట్స్ ని సంపాదించుకుంది.

బబ్లూ ఆమెను హాలిడేకు తీసుకెళ్లాడు, తన డబ్బుతో! బాగా పెద్దవాడయ్యాడు. పాటల మీద ఆసక్తి. బాగా పాడుతున్నాడు కూడా.

ఆ సాయంత్రం ఆమెకిష్టమైన సింగర్ మ్యూజిక్ కన్సర్ట్ కు తీసుకెళ్లాడు.

గొప్ప పాటగాడు. స్టేజి మీద మెరుపు తీగెలా కదులుతూ పాడుతున్నాడు.

అభిమానులు అతని కెరీర్లో మొదటి పాట పాడమన్నారు.

"ఆ పాట పాడిన నాడు తన తల్లి కళ్లలో మెరుపు చూశానని, ఆ మెరుపే తన ప్రయాణానికి మూలమైందని, పాట తన తల్లికి డెడికేట్ చేస్తున్నాన"ని చెప్పి పాడాడు.

కన్సర్ట్ అయ్యాక హోటల్ కు తిరిగి వచ్చారు. బాల్కనీ లో నిలబడింది.

వెన్నెల రాత్రి.

దూరంగా నల్లని సముద్రం.

ఓ మూల తెల్ల చేమంతుల మొక్క ఆమె వంకే చూస్తోంది.

వెనక్కి తిరిగి గదిలోకి చూసింది.

టీవీలో, ఆనాడు తను వెళ్లిన కన్సర్ట్ ని మళ్లీ టెలికాస్ట్ చేస్తున్నారు.

**నేడేరా నీకు నేస్తము, రేపే లేదు**

**నిన్నంటే నిండు సున్నరా, రానే రాదు**

**ఏడేడు లోకాలతోన బంతాటలాడాలి ఈనాడే**

**తకతకధిమితకఝును**

**జగడ జగడ జగడం చేసేస్తాం**

**రగడ రగడ రగడం**

రోహిత్ మెరుపులా కదులుతూ స్టేజి మీద పాడుతున్నాడు.

శ్యామల ముఖం చూపిస్తున్నారు , క్లోజ్ అప్ లో. ఆమె కళ్లు మెరుస్తున్నాయి.

***(వచ్చే నెల మరో అనగనగా.....)***

Post your comments